# బలగం BALAGAM TV


BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 12 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## యాదగిరిగుట్ట ఆలయంలో ఉద్యోగులపై వేటు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. విధులకు గైర్హాజరవుతున్నారని ఒకరు, దేవస్థానం సొమ్మును సొంతానికి వాడుకున్నందుకు మరొకరిని ఆలయ ఇఒ భాస్కర్‌రావు సస్పెండ్ చేశారు. దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావ్య గత 4 నెలల నుంచి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తరచుగా విధులకు గైర్హాజరవుతోంది. ఈ విషయాన్ని గమనించిన ఇఒ విచారణకు ఆదేశించగా సదరు ఉద్యోగిని ఇష్టమొచ్చినట్లు విధులకు వస్తోందని, కనీసం ఉన్నతాధికారులు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు తేలింది. ఈ ఆరోపణ నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేశారు. అదేవిధంగాదేవస్థానం సొమ్ములను తమ సొంత అవసరాలకు వాడుకున్న రికార్డు అసిస్టెంట్ నర్సింగరావును కూడా సస్పెండ్ చేసినట్లు ఇఒ తెలిపారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో వాహనాలకు టికెట్లు జారీ చేసే కౌంటర్‌లో విధులు నిర్వహిస్తూ వాహనాల ద్వారా వచ్చే డబ్బులను బ్యాంక్‌లో జమ చేయకుండా తన అవసరాలకు వాడుకున్నాడని తేలడంతో అతనిని సస్పెండ్ చేశారు.



# ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను చట్టబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాం

- కేబినెట్ సబ్ కమిటీ వేసి అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నాం
- అభ్యంతరాలుంటే ఉపసంఘానికి, కమిషన్‌కు తెలపండి
- మందకృష్ణ మాదిగకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- 1,2,3 గ్రూపులుగా కాకుండా ఏబీసీడీలుగా వర్గీకరించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

షెడ్యూల్డు కులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సిఫారసులను శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ కలిశారు. కమిషన్ చేసిన సిఫారసుల్లో క్రీమీలేయర్ ప్రతిపాదనను తిరస్కరించి, మిగతా వర్గీకరణ ప్రతిపాదనలను శాసనసభ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ భేటీ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాదిగ ఉపకులాల ప్రతినిధులు ఉన్నారు.

రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు చెప్పారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ , మాదిగ ఉపకులాల ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు ఎదురు కావొద్దన్న ఆలోచనతో ప్రక్రియను చట్టబద్ధంగా ముందుకు తీసుకువెళ్లామని, అందులో భాగంగానే తొలుత అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీని నియమించడంతో పాటు న్యాయ కమిషన్ ఏర్పాటు చేశామని వివరించారు. సాధ్యమైనంత తొందరగా సదరు నివేదికలను తెప్పించి, కమిషన్ సిఫార్సులను కేబినెట్ లో, ఆ తర్వాత అసెంబ్లీలో ఆమోదించామని సీఎం గుర్తుచేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని మంద కృష్ణ ఈ సందర్భంగా అభినందించారు. వర్గీకరణ ప్రక్రియను ఒక నిబద్ధతతో చేపట్టిన ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక సోదరుడిగా అండగా ఉంటానని మందకృష్ణ తెలిపారు. కాగా, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ భేటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాదిగ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుంభమేళాకు వెళ్లి తిరిగొస్తూ..



- మధ్యప్రదేశ్‌లోని జబల్ పూర్ సమీపంలో మినీ బస్సును ఢీకొట్టిన లారీ
- ఏడుగురు హైదరాబాద్ వాసులు మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రయాగ్ రాజ్ మహాకుంభ మేళాకు వెళ్లి పుణ్య స్నానాలను అచరించి తిరిగి వస్తున్న వారిని మృత్యువు కబళించింది. మధ్యప్రదేశ్‌లో మంగళవారం ఉదయం హైవేపై ఓ మినీ బస్సును ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా హైదరాబాద్ నాచారం ప్రాంతానికి చెందినవాళ్లుగా నిర్ధారణ అయ్యింది.

వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి ఈ నెల 9న 14 మంది ప్రయాణికులు (ఏపీ 29 డబ్ల్యూ 1525 నెంబరు గల) మినీ బస్సులో కుంభమేళాకు వెళ్లారు. అక్కడ పుణ్య స్నానాలను ఆచరించి మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 8.30 గంటలకు మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని జబల్ పూర్ జిల్లా కేంద్రానికి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిహెూరా పట్టణానికి సమీపంలో వంతెనపై వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సును సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ రాంగ్ రూట్ లో వచ్చి బలంగా ఢీకొట్టింది. దాంతె మినీ బస్సు (టెంపో ట్రావెల్లర్ బస్సు) నుజ్జు నుజ్జయింది. మినీ బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మతి చెందారు. మరి కొందరు దాంట్లో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుల్ని రక్షించి సిహెూరా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మతదేహాలు హైదరాబాద్‌కు బుధవారం మధ్యాహ్నం వరకు రావచ్చని తెలిసింది. మృతి చెందిన వారు హైదరాబాద్ నాచారంలోని కార్తికేయనగర్‌కు చెందిన రాంపల్లి రవికుమార్(56), బోరంపేట సంతోష్ (47), అదే కాలనీకి చెందిన సురకంటి మల్లారెడ్డి(64), బాలక్రిష్ణ (62), రాఘవేంద్ర కాలనీకి చెందిన సోమవరం శశికాంత్ (38), హైదరాబాద్ లోని ముసరాంబాగ్‌కు చెందిన ఆనంద్ కుమార్ (47), చైతన్య పురికి చెందిన నవీన్ చారి(49)గా గుర్తించారు.

# మళ్లీ బర్డ్ ఫ్లూ భయం



- ఏపీలో బర్డ్‌ఫ్లూ కలకలం
- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం
- పౌల్ట్రీ వాహనాలకు నో ఎంట్రీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఏపీలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వెలుగుచూడటం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతోంది. ఏపీలో చికెన్ అమ్మకాలు నిలిపివేయాలని జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. బర్డ్ ఫ్లూ తేలిన ఫారాల్లోని కోళ్ళు, గుడ్లను పూడ్చి పెట్టాలన్నారు. దీంతో మిగతా ప్రాంతాలవారు చికెన్ తినడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెంగాణకు వచ్చే పౌల్ట్రీ వాహనాలను నిలిపివేయాలని జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్టు అధికారులను ఆదేశించింది. రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. ఏపీ నుంచి వచ్చే పౌల్ట్రీ వాహనాలకు ప్రవేశాన్ని నిరాకరిస్తోంది.

బుధవారం ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ టోల్ ప్లాజా వద్ద జిల్లా పశువైద్యశాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. కర్నూలు తదితర ప్రాంతాల నుంచి కోళ్లతో వచ్చే వాహనాలను తనిఖీలు చేసి వెనక్కి పంపారు. సోమవారం సాయంత్రం కూడా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి పక్షులు, పక్షి దాణా తీసుకువెళ్లే వాహనాలకు సైతం అనుమతి ఇవ్వరాదని పశుసంవర్ధక, పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సరిహద్దు గ్రామాల్లోని పౌల్ట్రీ రైతులకు వైరస్ వ్యాప్తి చెందకుండా పరిశుభ్రత చర్యలు తీసుకునేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణకు వచ్చే అన్ని జిల్లాల సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని పొరుగు రాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రంలోకి వచ్చే పౌల్ట్రీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చికెన్ షాపు నిర్వాహకులకు, ప్రజలకు కూడా బర్డ్ ఫ్లూ గురించి అవగాహన కల్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనా లను వెనక్కి పంపుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి తెలంగాణకు

మిగితా 2వ పేజీలో

# ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెబుతారు
- మాజీ సీఎం కేసీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో పాటు పలువురు నాయకులు ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య మళ్లీ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## డీఎస్‌సి 2008 అభ్యర్థులకు శుభవార్త

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

డీఎస్‌సి 2008 అభ్యర్థులకు ఒకటి రెండు రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి కానున్నది. హైకోర్టు ఆదేశాల మేరకు 1,382 మందికి అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ త్వరలో విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయనున్నది. విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే ఆయా జిల్లాల్లో అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు పోస్టింగులు ఇవ్వనున్నరు. హైకోర్టులో విచారణ సందర్భంగా 1,382 మంది డిఎస్‌సి 2008 అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని విద్యాశాఖ న్యాయస్థానానికి తెలిపగా, తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు నియామక ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతున్నది. 2008లో నోటిఫికేషన్‌లో డిఎడ్ అభ్యర్థులతో భర్తీ కాగా మిగిలిన 2367 పోస్టులను అర్హత సాధించిన బి.ఇడ్ అభ్యర్థులను ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా కాంట్రాక్ట్ పద్ధతిన నియమించాలని హైకోర్టు గత ఏడాది ఫిబ్రవరిలో ఆదేశాలు జారీ చేసింది. 2367 మందికిగాను 1382 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలకు ఆసక్తి చూపారని, ఎంఎల్‌సి ఎన్నికల నియమావళి రావడంతో నియామకాలకు కొంత గడువు కావాలంటూ హైకోర్టును ప్రభుత్వం గడువు కోరింది. ఎన్నికల నియమావళి కోర్టు ఉత్తర్వుల అమలుకు అడ్డంకి కాదని వాటిని అమలు చేయాల్సిందేనంటూ గత వారం తేల్చి చెప్పడంతో విచారణకు హాజరైన విద్యాశాఖ కమిషనర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.

## ఖమ్మంలో ప్రత్యేక రాజకీయ సమీకరణాలతో పార్టీకి నష్టం

వివరాలు 2వ పేజీలో

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో ఆత్మీయ సమావేశం

## ఏఐ విషయంలో దేశాలన్నీ ఐక్యంగా ముందుకువెళ్లాలి

- ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోదీ కృత్రిమ మేధ (ఏఐ) అంశంలో అన్ని దేశాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏఐతో వచ్చే పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించాలని హెచ్చరించారు. ప్రస్తుతం ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న మోదీ, పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి సహ అధ్యక్షుడిగా హాజరై, పలు దేశాధినేతలు, టెక్నాలజీ రంగ నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు . "ఏఐ ప్రభావంతో మన రోజువారీ పనుల్లో మార్పులు అనివార్యం. సాంకేతికత ఉద్యోగాలను తీసుకుపోతుందనుకోవడం తప్పు. నైపుణ్యాన్ని పెంచుకునే వారికి మాత్రమే మెరుగైన అవకాశాలు లభిస్తాయి. భారత్ డిజిటల్ మార్కెట్, వాణిజ్యం రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోంది," అని ప్రధాని మోదీ అన్నారు.

ఏఐ జీవితాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో ఏఐ పాత్ర కీలకం. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల కోసం.. ప్రయాణాన్ని సులభంగా, వేగవంతం చేయడానికి ఏఐ సహాయపడుతుందని మోదీ అన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనడం సరైంది కాదు.

సాంకేతిక అనేది నైపుణ్యం పెంచుకునేవారికి ఓ మంచి అవకాశం. కాలానుగుణంగా ఉద్యోగాల స్వభావం మారుతుంది. కొత్త రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తాయని మోదీ అన్నారు. డిజిటల్ మార్కెట్, వాణిజ్యం దిశగా భారత్ ముందుకు దూసుకెళ్తోంది. పాలించడం అంటే ప్రత్యర్థులను ఎదుర్కోవడం, ప్రమాదాలు రాకుండా చూసుకోవడం మాత్రమే కాదు.. కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించడం కూడా. అప్పుడే దేశం ఇంకా అభివృద్ధి చెందుతుంది.



ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించిన ప్రధాని మోదీ.. ఏఐకి భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గణాంకాలతో సహా వివరించారు. అలాగే "మంచి కోసం ఏఐ.. అందరికీ ఏఐ" ఇదే భారత్ నినాదమని ఆయన ప్రకటించారు. సైబర్ సెక్యూరిటీ, తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అవసరమైన అప్లికేషన్‌లను సృష్టించాలని అన్నారు.

టెక్ పరిశ్రమలో భారతదేశం సాధించిన విజయాలను కూడా ప్రధాని మోదీ.. ఈ వేదికపై హైలైట్ చేశారు. చాలా తక్కువ ఖర్చుతో 1.4 బిలియన్లకు పైగా ప్రజలకు డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విజయవంతంగా నిర్మించామని అన్నారు. మేము మా డేటా సాధికారత, రక్షణ నిర్మాణం ద్వారా డేటా శక్తిని అన్‌లాక్ చేసాము. డిజిటల్ వాణిజ్యాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా.. అందరికీ అందుబాటులోకి తెచ్చామని ఆయన అన్నారు.




## ఒక్క నిమిషం కూడా కరెంట్ పోకూడదు..

- అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాబోయే వేసవి కాలంలో డిమండ్ మేరకు విద్యుత్ ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం ఆయన సచివాలయంలో %ప్రాణజూ% పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళిక పై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్.. రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్ డిమాండ్ ఉంటుంది. అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనేది చాలా సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి ప్రణాలికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెంటనే సమావేశం నిర్వహించుకొని క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు. వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాలన్నారు.

## పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటాపై సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటాపై ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఏపీలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకు కూడా ఆర్టికల్ 371(డీ) ప్రకారం తెలంగాణలో స్థానికత కోటాలో పీజీ సీట్లు కేటాయించాలని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 371(డీ) ప్రకారం రాయలసీమ, ఆంధ్ర రీజియన్‌లో ఎంబీబీఎస్ చదివిన వారు కూడా తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా కింద అర్హులని తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే దేశవ్యాప్తంగా పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ ఇటీవల జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ పిటిషన్‌పై విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది.

## సన్ ఫ్లవర్‌కు మద్దతు ధర కల్పించండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను నేడు ఆయన పరిశీలించారు. కాలువలో



ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు.

మిగితా 2వ పేజీలో

# ఖమ్మంలో ప్రత్యేక రాజకీయ సమీకరణాలతో పార్టీకి నష్టం

- ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ క్యాడర్‌తో ఆత్మీయ సమావేశం



బలగం టీవీ, హైదరాబాద్

ఖమ్మం జిల్లాలోని ప్రత్యేక రాజకీయ సమీకరణాల కారణంగా బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2014 తర్వాత ఖమ్మంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అసాధారణ అభివృద్ధి చేసిందని ఆయన గుర్తు చేశారు. పువ్వాడ అజయ్ లాంటి ఉత్సాహవంతమైన నాయకుడు ఓడిపోవడం బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లాలోని ప్రత్యేక రాజకీయ సమీకరణాల కారణంగా బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి పాలైనా కూడా ప్రజలకు కష్టం వస్తే బీఆర్ఎస్ నాయకుల గులాబీ దండు ఏడాది కాలంగా వారికి అండగా ఉందని స్పష్టం చేశారు. ఖమ్మంలో వరదలు వస్తే ప్రజలకు పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చాడన్నారు. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎంతో కలిసి ముగ్గురు మంత్రులు ఉన్నారని.. కానీ వరదల సమయంలో వాళ్ల వల్ల ఒక్క పైసా కూడా ఉపయోగం లేదని కేటీఆర్ పెదవి విరిచారు. ఒక కుటుంబం వరద నీటిలో చిక్కుకుంటే కనీసం హెలికాప్టర్ తెప్పించి.. వారిని కాపాడాలన్న సోయి సైతం ఈ మంత్రులకు లేదని ఆయన పేర్కొన్నారు. కానీ ఎమ్మెల్యేల బర్త్ డేలు.. ఇతర పనికి మాలిన పనులకు మాత్రం మంత్రులు హైదరాబాద్ నుంచి కూతవేటు దూరానికి కూడా హెలికాప్టర్లలో పోతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాతే.. ఖమ్మంలో మంత్రులు పర్యటించారన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి సైతం ఓపెన్ టాప్ జీపులో చేతులు ఊపుతూ.. కాలు కింద పెట్టకుండా అటు ఇటు తిరిగి వెళ్లిపోయాడని వ్యంగ్యంగా అన్నారు.ప్రజలు తిడుతున్న తిట్లు వింటే పౌరుషమున్న ఎవరైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవారని కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కానీ రేవంత్ రెడ్డికి రోషం లేదు కాబట్టి అన్ని దులుపుకొని తిరుగుతున్నాడన్నారు. మా స్కూటీ ఏమైందని కాలేజీ పిల్లలు కూడా పోస్ట్ కార్డు ఉద్యమం మొదలుపెట్టారని చెప్పారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోస పోయామని అనుకోని వర్గం ఏది ఈ రాష్ట్రంలోనే లేదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయే సరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణలోని ప్రతి ఒక్కరూ ఉన్నారన్నారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని పనులతో పాటు తెలంగాణలోని ప్రతి పని కాంట్రాక్టు కూడా ఇవ్వాళ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతుంది. డిప్యూటీ సీఎం 30 శాతం కమిషన్లు తీసుకొని పనులు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యే చెప్తున్నారని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి రుణమాఫీ కాలేదని చెప్తుంటే.. సీఎం మాత్రం మొత్తం రుణ మాఫీ అయిందంటారని కేటీఆర్ వ్యంగ్యంగా ఆరోపించారు.

కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 51.5 శాతం ఉంటే రేవంత్ చేసిన కుల గణన సర్వేలో మాత్రం ఐదున్నర శాతం తగ్గించి 46% కి బీసీ జనాభాను చూపిస్తుందని మండిపడ్డారు. తెలంగాణలోని ప్రతి వర్గాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే అవకాశం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఏడాది కాలంగా కేసులు పెట్టి వేధిస్తున్నా.. విచారణల పేరిట పిలిచి జైల్లో పెడతామని బెదిరిస్తున్నప్పటికీ, ప్రజా సమస్యల మీద రేవంత్ రెడ్డితో కొట్లాడామని.. భవిష్యత్తులో సైతం కొట్లాడుతామని ఈ సంధ్బంగా ఆయన స్పష్టం చేశారు.

పోలీసులను అడ్డం పెట్టుకొని ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్థానిక సంస్థల్లో ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. ఈ కుతంత్రాలను గులాబీ దండు అడ్డుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే తాను త్వరలోనే ఖమ్మంలో పర్యటిస్తానని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

# సన్ ఫ్లవర్‌కు మద్దతు ధర కల్పించండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను నేడు ఆయన పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు.

అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖి చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. సాగునీరు అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కెసిఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్ రావు గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీష్ రావు విమర్శించారు. రైతుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

# మళ్లీ బర్డ్ ఫ్లూ భయం

(మొదటి పేజీ తరువాయి)

బాయిలర్ కోళ్లను తరలించకుండా ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురం క్రాస్ రోడ్‌లోని అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వైరస్ సోకడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బాయిలర్ కోళ్లను తరలించకుం డా పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. రోజుకు ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున వెటర్నరీ సంబంధిత అధికారులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బోర్డర్‌లో విధుల్లో ఉన్నారు. కాగా, జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్ ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి మంగళవారం ఎపి నుంచి వచ్చిన రెండు కోళ్ల లారీలను అడ్డుకుని తిప్పి పంపించారు. సోమవారం కూడా ఐదు లారీలను వెనక్కి పంపారు.

ఎపిలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాలో 50 లక్షలకు పైగా కోళ్ళు మృతి చెందినట్లు అంచనా. తూర్పుగోదావరి జిల్లా కానూరులో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యింది. బర్డ్‌ఫ్లూ వైరస్ భయం అధికారులు హెచ్చరికలతో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. ఆదివారం కెజి 220 వరకు పలికిన ధరలు మంగళవారానికి రూ.150రూ.170కి తగ్గాయి. బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ జోలికి పోవడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో చికెన్, గుడ్ల ధరలు భారీగా తగ్గాయి. బర్డ్‌ఫ్లూ కేసులు వచ్చిన 10 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆ ప్రాంతాల్లో గుడ్లు తినొద్దని సూచించారు.




# ఛాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం..

బలగం టీవీ, హైదరాబాద్

భారత జట్టుకు భారీ షాక్ తగిలింది. భారత్ ఫాస్ట్ బౌలర్ బూమ్రా చాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ కు దూరం కాబోతున్నాడు. బుమ్రాగాయం కారణంగా బాధపడుతున్న సంగతి తెలిసిందే. అతని వెన్నునొప్పి కారణంగా ప్రస్తుతం టీమిండియా కు దూరంగానే ఉంటున్నాడు . మొదట ఇంగ్లాండ్ తో జరిగే వన్డే సిరీస్ కు అతని సెలెక్ట్ చేసి చివరి క్షణంలో తప్పించింది భారత క్రికెట్ నియంత్రణ మండలి. అంతేకాదు చాంపియన్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ కు కూడా బూమ్రాను సెలెక్ట్ చేసింది బీసీసీఐ. ఇప్పుడు మళ్లీ ఈ విషయంలో వెనక్కి తగ్గింది భారత క్రికెట్ నియంత్రణ మండలి. టీమిండియా ఫాస్ట్ బౌలర్ బొమ్మ గాయం తగ్గలేదట. అతని వెన్నునొప్పి మరింత పెరిగినట్లు సమాచారం అందుతుంది. అందుకే వైద్య పరీక్షలు చేసిన వైద్యులు హెల్త్ రిపోర్ట్ తాజాగా విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ రిపోర్టు ప్రకారం మరో నెల రోజులపాటు బూమ్రా రెస్ట్ తీసుకోవాలని సమాచారం.

ఇక బుమ్రా స్థానంలో యువ బౌలర్ హర్షిత్ రాణాకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ అవకాశం కల్పించింది. మరోవైపు యశస్వి జైస్వాల్‌కి తుది జట్టులో స్థానం దక్కలేదు. అతడి స్థానంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఎంపికయ్యాడు.

భారత్ జట్టు ఇదే: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ ( వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (కీపర్), రిషభ్ పంత్ (కీపర్), హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ షమీ, అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి. నాన్ ట్రావెలింగ్ సబ్‌స్టిట్యూట్ ప్లేయర్లు: యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్, శివం దూబె

# బంగ్లాదేశ్‌లో డిసెంబర్‌లో ఎన్నికలు

బలగం టీవీ, హైదరాబాద్

బంగ్లాదేశ్‌లో డిసెంబర్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నట్లు, అందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం మంగళవారం తెలిపింది. బంగ్లాదేశ్‌లో డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా విధ్వంసకాండ జరిగాక సార్వత్రిక ఎన్నికల ప్రతిపాదనకు తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ ముహమ్మద్ యూనుస్ ఒప్పుకున్నట్లు తెలిసింది. డిసెంబర్ నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని మజీ ప్రధాని ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి)కి మూనుస్ హామీ ఇచ్చిన మరునాడు ఈసి ఈ వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల కమిషనర్ అబుల్ ఫజల్ మొహమ్మద్ సనావుల్లా విలేకరులతో మాట్లాడుతూ 'ఈ సంవత్సరం డిసెంబర్‌లో సార్వత్రిక ఎన్నికలకు మేము సిద్ధమవుతున్నాము' అన్నారు. సమావేశంలో పాల్గొన్న ఐక్యరాజ్యసమితి రెసిడెంట్ ప్రతినిధి స్టీఫన్ లిల్లర్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలు బంగ్లాదేశ్ చరిత్రలో అత్యుత్తమం కానున్నాయని ఐక్యరాజ్యసమితి అంచనా వేసిందన్నారు. 'స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడానికి మేము ఈసికి మద్దతు ఇస్తున్నాము' అన్నారు.

# యువతిపై పెట్రోల్ పోసిన యువకుడు

బలగం టీవీ, హైదరాబాద్

తనను ప్రేమించడం లేదని సుందర్ ప్రమోద్ అనే యువకుడు ఓ యువతిపై పెట్రోల్ పోసిన ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఈ వ్యవహారం అంతా గమనించిన స్థానికులు యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. హుజూర్‌నగర్ ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాకు చెందిన 23 ఏళ్ల యువతి గత మూడు నెలల నుంచి హుజూర్‌నగర్ పట్టణంలోని తన మేనమామ ఇంటి వద్ద ఉంటోంది. యువతి ప్రస్తుతం కోదాడ రోడ్డు వైపు ఉన్న ఓ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోంది. గతంలో పరిచయం ఉన్న తన గ్రామనికే చెందిన సుందర్ ప్రమోద్ కుమార్ అనే వ్యక్తి ఈనెల ఫిబ్రవరి 10వ తేదీన మధ్యాహ్నం సమయంలో బాధితురాలికి ఫోన్ చేశాడు. నీతో మాట్లాడాలి మీ ఆఫీస్ నుంచి బయట రమ్మని కోరగా ఆమె వచ్చింది. తనను ఎందుకు ప్రేమించడం లేదని ఆమెతో గొడవపడి తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లోని ఉన్న పెట్రోల్‌ను ఒక్కసారిగా ఆమెపై పోసి హత్యకు ప్రయత్నించాడు. దీనిపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

# మొత్తం 192 నామినేషన్లు ..!

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ నియోజక వర్గంలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల గడువు సోమవారంతో ముగిసింది. దీంతో మూడు నియోజక వర్గాలలో కలిపి మొత్తం 192 నామినేషన్లు దాఖలయ్యాయని సమాచారం. అయితే పూర్తి స్థాయి సమాచారం ఇంకా రాలేదని, త్వరలోనే నామినేషన్లకు దాఖలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియచేస్తామని సీఈవో తెలంగాణ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నామినేషన్ల స్క్రూట్నీ ప్రక్రియ నిర్వహిఁచారు. అయితే దాఖలు చేసిన నామినేషన్లు ఉపసంహారించుకోవడానికి ఈ నెల 13 వరకు గడువు ఉంది. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు స్పష్టంగా తెలుస్తుంది. అయితే ఈ నెల 27న పోలింగ్ నిర్వహించనున్నారు. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ నియోజక వర్గాలకు ఈ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే.



## వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి...

**-పీఎం శ్రీ పాఠశాల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్దేశిత అభివృద్ధి పనులను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పీఎం శ్రీ పాఠశాలల పై సంబంధిత అధికారులు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పీఎం శ్రీ కింద మొత్తం 16 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని, వీటిలో నిర్దేశిత అభివృద్ధి పనులను అవసరమైన మౌలిక వసతులు ఫర్నిచర్, ఇంటర్నెట్ టచ్ స్క్రీన్ లు, శుదమైన తాగునీరు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, మేజర్ %ిడ% మైనర్, రిపేర్స్, స్మార్ట్ టీ.వి.లు, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్, సోలార్ పవర్ ప్యానెల్స్, సీసీ టీవీ కెమెరాలు, పుస్తకాలు మొదలగునవి ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

పీఎం శ్రీ క్రింద పాఠశాలలకు వచ్చిన నిధులను ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని,చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, పాఠశాలల్లో అకాడమిక్ పరంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో మన జిల్లా నుంచి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని, పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని అన్నారు.

పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలను ఒకటికి రెండుసార్లు వారిచే పునరావృతం చేయించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, 16 స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..?

**- సౌకర్యాలు ఎలా ఉన్నాయి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,గంభీరావుపేట**

రెసిడెన్షియల్ విద్యాలయంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. మంగళవారం గంభీరావుపేట మండలం నర్మాలలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు పరిశీలించారు. అనంతరం కిచెన్, స్టోర్ రూమ్ లో ఆయా ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులు రివిజన్ చేస్తుండగా, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో విద్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఇంకా ఏ ఏ సౌకర్యాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో నిత్యం చదవాలని పిలుపు నిచ్చారు. ప్రతి సబ్జెక్టులో వచ్చే సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన,ఉపాధ్యాయినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు

**-ఎమ్మెల్సీ పోలింగ్ విధులపై సంపూర్ణ అవగాహన ఉండాలి..**

**-సీపీఓ, మ్యాన్ పవర్ అండ్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సీపీఓ, మ్యాన్ పవర్ అండ్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం మొదటి విడుత శిక్షణ తరగతులను నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఓ శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని, ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందని అన్నారు . బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు . 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి టోకెన్ నెంబర్లు అందించి ఓటింగ్ చేయించాలని ఆదేశించారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 8.00 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని అన్నారు . పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్టు అనుగుణంగా మెటీరియల్ అంతా ఉందా లేదా సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు . ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు . నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని అన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీఓలు తమ పర్యవేక్షణలో ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పీఓలదేనని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలనిఅన్నారు . ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పీఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు మహేందర్ రెడ్డి, శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జిల్లాలో పీఓలు మొత్తం 42 మంది, ఏపీఓలు 42, ఓపీఓలు 97, మైక్రో అబ్జర్వర్స్ 17 కేటాయించగా, కామన్ పోలింగ్ కేంద్రాలు 07, జనరల్ పోలింగ్ కేంద్రాలు 27 ఏర్పాటు చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో డీడబ్ల్యూఓ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, పీఓ, ఏపీఓలు, ఓపీఓలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు చట్టాలు వర్తించవా..




**బలగం టీవీ , సిరిసిల్ల**

అధికార పార్టీకి ఓ న్యాయం..బడుగు బలహీన వర్గాలకు ఓ న్యాయమా చట్టం మీ చుట్టమా అని బీఆర్ఎస్ నేత మాట్ల మధు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్ల మధు మాట్లాడుతూ ప్రమోషన్లు ,ఉద్యోగాలు ఇప్పిస్తానని బడుగు బలహీనవర్గాల దగ్గర డబ్బులు దోచుకున్న కాంగ్రెస్ నేత మృత్యుంజయం పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని అధికార పార్టీ నేతలపై చర్యలు తీసుకోవడానికి కలెక్టర్ ఎందుకు వెనకడుగు వేస్తున్నాడని ప్రశ్నించారు.మృత్యుంజయం వ్యవహారంలో కేకే మహేందర్ రెడ్డికి సైతం వాటా అందినట్లు కనిపిస్తుందని ఆరోపించారు. కేకే కి వాట లేకపోతే జరిగిన వ్యవహారంపై సదరు నాయకుడిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని అన్నారు.

బడుగు బలహీనవర్గాలకు చెందిన వాళ్ళ నుండి కటకం మృత్యుంజయం అడ్డగోలుగా పైసలు వసూలు చేసిండని,న్యాయం అడిగిన బాధితులను బెదిరింపులకు గురిచేయడమే కాకుండా,అధికారులను కూడా నానా బూతులు తిట్టుడేందని అన్నారు. సదరు కాంగ్రెస్ నేతపై కలెక్టర్ ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాపై ఏటువంటి పిర్యాదులు రాకున్నా అక్రమంగా అరెస్టులు చేసి జైల్లో పెట్టించారు,మరి వాళ్ళ సంగతి ఏంటని,మరి ఇప్పుడు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని అన్నారు.కలెక్టర్ ను ఒక్క మాట అనకున్నా, నా పై కేసు నమోదు చేసారని అన్నారు.రెండు రోజులు కావస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదని,ఏం చర్యలు తీసుకుంటరో చెప్పాలని డిమాండ్ చేశారు. మృత్యుంజయం,కేకే మహేందర్ పై చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో బిఆర్ఎస్ తరపున ఆందోళనకార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. చాలా చోట్ల కాంగ్రెస్ నాయకులు వసూళ్ల పర్వానికి తెర లేపారని,అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరం వచ్చినప్పుడు బయట పెడతమని అన్నారు.కొయ్యడ రమేష్, చిలువేరు చిరంజీవి, ఇమ్మనేని అమర్ రావు, కంచర రవి గౌడ్, గుండు ప్రేమ కుమార్, కుర్మ రాజయ్య, ఆత్మకూరు చంటి, నీరటి బాబు, బండి జగన్, బండి దేవేందర్ యాదవ్, సయ్యద్ అఫ్రోజ్ లు పాల్గొన్నారు

## అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ వో రజిత ఆదేశానుసారం డాక్టర్ అభిజా మెడికల్ ఆఫీసర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల చేత కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సంబంధించిన ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎంఓ దేవ్ సింగ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందజేస్తే పూర్తిగా నయం అవుతుందని, ఆలస్యం చేయడం వలన అంగవైకల్యం వచ్చే అవకాశం ఉందని చర్మంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ జ్ఞానం లేని ఎరుపు మచ్చలు ఉంటే మొదటి దశలోనే ఆసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. దీనికి ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి ఆయుష్ మెడికల్ ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపాల్ రెహన ఇఫ్రత్, హెల్త్ అసిస్టెంట్ సతీష్ కుమార్, ఏఎన్ఎం మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# వైట్‌వాష్ చేస్తారా..?

**నేడు భారత్ ఇంగ్లాండ్ మధ్య మూడో వన్డే**
**క్లీన్‌స్వీప్ పై భారత్ కన్ను**
**మార్పులతో బరిలోకి దిగనున్న భారత్**





**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే కైవసం చేసుకున్న టీమిండియా.. ఆఖరి పోరుకు సిద్ధమైంది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న భారత జట్టు చివరి మూడో వన్డేలోనూ గెలుపొందాలని భావిస్తోంది. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం టీమ్ఇండియా తుది జట్టులో పలు మార్పులు చేసి బెంచ్ బలాన్ని పరీక్షించాలనుకుంటోందని తెలిసింది. సిరీస్‌లో ఇప్పటివరకు ఆడని వికెట్ కీపర్ రిషభ్ పంత్ , ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మోకాలి వాపుతో తొలి వన్డేకు దూరంగా ఉన్న విరాట్ కోహ్లీ రెండో మ్యాచ్‌తో జట్టులోకి వచ్చాడు. కానీ ఆశించిన రీతిలో రాణించలకపోయాడు. మరోవైపు రోహిత్ శర్మ మాత్రం విధ్వంసకర శతకంతో ఫామ్ అందుకున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో హాఫ్ సెంచరీ సాధించిన శుభ్‌మన్ గిల్‌కు మూడో వన్డే నుంచి రెస్ట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అతని స్థానంలో యశస్వి జైస్వాల్‌ను ఆడించవచ్చు. హర్షిత్ రాణా కూడా బెంచ్‌కే పరిమితమవ్వనున్నాడు. అతని స్థానంలో అర్షదీప్ సింగ్ బరిలోకి దిగవచ్చు. తొలి రెండు మ్యాచ్‌ల్లో రిషభ్ పంత్‌కు కూడా చోటు దక్కలేదు. అతని స్థానంలో ఆడిన కేఎల్ రాహుల్ మెరుగైన ప్రదర్శన చేయలేదు. కాబట్టి తొలి రెండు మ్యాచ్‌ల్లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన శ్రేయస్ అయ్యర్(59, 44)కు ఈ మ్యాచ్ నుంచి రెస్ట్ ఇచ్చి పంత్‌కు అవకాశం ఇవ్వనున్నారు. కేఎల్ రాహుల్‌కు కూడా మరో అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. అక్షర్ పటేల్ స్థానంలో వాషింగ్టన్ సుందర్ ఆడనుండగా.. బ్యాటింగ్ అవకాశం రాని జడేజా జట్టులో కొనసాగొచ్చు.తొలివన్డేలో ఆడిన మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అహ్మదాబాద్‌లో ఆడే అవకాశాలున్నాయి.

గత కొంతకాలంగా పేలవమైన ఫామ్‌తో సతమతమౌతున్న విరాట్ కోహ్లీ కూడా అహ్మదాబాద్ వన్డేతో ఫామ్ అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. వన్డేల్లో 14 వేల పరుగుల మైలురాయికి కోహ్లీ 89 పరుగుల దూరంలో ఉన్నాడు. మరోవైపు చివరి మ్యాచ్‌లోనైనా నెగ్గి ఛాంపియన్స్ ట్రోఫీకి ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలని ఇంగ్లాండ్ జట్టు భావిస్తోంది. నరేంద్రమోడీ స్టేడియంలో భారత్ చివరి వన్డే మ్యాచ్ 2023 నవంబర్ 19న ఆడింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలై మూడోసారి విశ్వవిజేతగా నిలిచే అవకాశాన్ని చేజార్చుకుంది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటన్నరకు మ్యాచ్ ఆరంభం కానుంది.



## ఇలాంటి విజయాన్ని చూసి చాలాకాలమైంది

**బలగం టీవి, హైదరాబాద్**

'అరవింద్‌గారు సినిమా కథ విన్న వేళా విశేషం, శోభితను నాగచైతన్య పెళ్లాడిన వేళావిశేషం రెండూ బావున్నాయి. ఈ సినిమా రిలీజ్ టైమ్‌లో మేం ఢిల్లీలో మోడీగార్ని కలవడానికి వెళ్లాం. సక్సెస్ అయ్యిందని ఒకటే మెసేజ్‌లు. ఇలాంటి విజయాన్ని చూసి చాలాకాలమైంది. ఇంతటి మంచి లవ్‌స్టోరీ చేసిన అరవింద్‌గారికి థ్యాంక్స్. 'గజని' సినిమాతో తొలి వందకోట్ల సినిమా తీసి రికార్డ్ సృష్టించారాయన. ఈ సినిమాకు కూడా వందకోట్లు వస్తాయంటున్నారు. ఇలాంటి విజయాలు ఆయనకు కొత్త కాదు. చందూ మొండేటి అద్భుతంగా తీశాడు. ఇక సాయిపల్లవిలో కనిపించే ప్యూరిటీ ఆమె చేసిన పాత్రలోనూ కనిపించింది. రెండేళ్లు ఈ సినిమాకోసం ఎంతో కష్టపడ్డాడు చైతూ. ఇందులో చైతూ నటన చూస్తే నాన్నగారు గుర్తొచ్చారు.' అని అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన తనయుడు నాగచైతన్య హీరోగా రూపొందిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందూ మొండేటి దర్శకుడు. బన్నీ వాసు నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అక్కినేని శోభిత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడారు. 100% లవ్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, తండేల్... ఇలా మూడు విజయాలను అల్లు అరవింద్ తమకు ఇచ్చారన్నారు. అల్లు–అక్కినేని కుటుంబానికి అంతా బాగా కుదిరిందన్నారు. 'తండేల్' ద్వారా నాగచైతన్యలోని మరో నటుడిని దర్శకుడు చందూ తీసుకువచ్చారని ప్రశంసించారు. చందూతో తాను సినిమాలు చేయలేదని, కానీ అతని ప్రతిభ గురించి తెలుసని నాగార్జున అన్నారు. సాయిపల్లవి డ్యాన్స్ ఎప్పుడూ బాగుంటుందన్నారు.

నాగచైతన్య మాట్లాడుతూ 'వస్తున్న స్పందన చూస్తుంటే చెప్పలేని ఆనందంగా ఉంది. '100పర్సంట్ లవ్' నా కెరీర్‌కి ఎంత బూస్ట్ ఇచ్చిందో.. ఈ సినిమా అంతకు మించి బూస్ట్ ఇచ్చింది. అందుకే అరవింద్‌గారికి థ్యాంక్స్. చందూ మొండేటితో ఇది నా మూడో సినిమా. ప్రాణం పెట్టి పనిచేశాడు.' అని ఆనందం వెలిబుచ్చారు. ఇకనుంచి అక్కినేని విజయాల పరంపర మొదలైనట్టేనని, త్వరలో చైతూతో 'తెనాలి రామకృష్ణ' చేయబోతున్నామని, ఆ పాత్రలో లెజెండ్రీ అక్కినేనిని తలపించేంత గొప్పగా చైతూను ప్రెజెంట్ చేయబోతున్నామని దర్శకుడు చందూ మొండేటి ప్రకటించారు.

**ఐశ్వర్య రాజేశ్ కి మరో వెబ్ సిరీస్ రెడీ అవుతోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో నిర్మితమైన ఆ సిరీస్ పేరే 'సుడల్ 2'. ఈ నెల 28వ తేదీ నుంచి ఐదు భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఐశ్వర్య రాజేశ్ .. కాథీర్ .. గౌరీ కిషన్ .. మంజిమా మోహన్ .. పార్తీబన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్‌కు పుష్కర్ - గాయత్రి క్రియేటర్స్ గా వ్యవహరించారు. సర్జున్ - బ్రహ్మ దర్శకత్వం వహించారు.**



## మజాకా నుంచి 'బేబీ మా'

**బలగం టీవి, హైదరాబాద్**

సందీప్ కిషన్ 30వ మూవీ 'మజాకా'. త్రి నాథ రావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ మూవీ టీజర్ ఇప్పటికే విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రం ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హా స్య మూవీస్, జీ స్టూడియోస్‌ల కొలాబరేషన్‌లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న మజాకాలో రావు రమేష్, అన్షు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. మొదటి సింగిల్ బ్యాచలర్స్ ఆంథమ్ సూపర్ హిట్ అయింది. ఇక ఇప్పుడు విడుదలైన సెకండ్ సింగిల్ బేబీ చార్ట్‌బస్టర్ లవ్ సాంగ్. ఈ పాటలో సందీప్ కిషన్ ప్రేమలో పడిన కథను బ్యూటీఫుల్‌గా చూపించారు. ఈ పాట సందీప్ తండ్రి రావు రమేష్, అన్షు ప్రేమకథను కూడా చూపిస్తోంది. సందీప్ కిషన్ ఎనర్జిటిక్‌గా కనిపించారు. డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం, లియోన్ జేమ్స్ సంగీతం పాటని మరింత బ్యూటీఫుల్‌గా మార్చాయి. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న మజాకా థియేటర్లలోకి రానుంది.




## ఓటీటీలో కంటే ముందుగానే టీవీలో 'సంక్రాంతికి వస్తున్నాం'

**బలగం టీవి, హైదరాబాద్**

సంక్రాంతికి విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఓటీటీలో కంటే ముందు జీ తెలుగు శాటిలైట్ ఛానెల్‌లో ప్రసారం చేస్తుందనే వార్త ఇప్పుడు సంచలనంగా మారింది. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఓటీటీ, డిజిటల్ అండ్ శాటిలైట్ హక్కులను జీ తెలుగు దక్కించుకుంది. అయితే అందరూ మొదట ఈ చిత్రం జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కాబోతుందని భావించారు. అయితే జీ సంస్థ మాత్రం ఈ సినిమా మొదటగా తమ జీ తెలుగు ఛానెల్‌లో ప్రసారం కాబోతుందని సోషల్ మీడియాలో ప్రకటించి అందరికీ ట్విస్ట్ ఇచ్చింది. సోమవారం తన సోషల్ మీడియా అకౌంట్‌లో జీ తెలుగు సంస్థ ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను పోస్ట్ చేసింది. "మళ్ళీ సంక్రాంతి వైబ్‌ను ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి" ఓటీటీ కంటే ముందుగా టీవీలో అంటూ ఈ పోస్ట్‌కు హ్యాష్‌ట్యాగ్‌ను జత చేసింది. దీంతో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం మొదట టెలివిజన్ ప్రీమియర్‌గా అందర్నీ అలరించడానికి రెడీ అవుతోంది. అయితే ఓటీటీ కన్నా ముందుగా టీవీలో ప్రసారం చేయడానికి వెనుక జీ తెలుగు మార్కెటింగ్ స్ట్రాటజీ కూడా ఉందని తెలిసింది. 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాను ముందు టీవీలో ప్రసారం చేస్తే టీఆర్‌పీ రేటింగ్స్ బాగుంటాయని జీ తెలుగు ఆలోచనలా ఉంది.

## ఆస్పత్రిలో చేరిన పృథ్వీ

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ సీనియర్ నటుడు, ప్రముఖ కమెడియన్ పృథ్వీ రాజ్ అస్వస్థతకు గురయ్యారు. హైబీపీకి గురికావడంతో కుటుంబ సభ్యులు పృథ్వీ రాజ్‌ను ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

కాగా, 'లైలా' సినిమా ఈవెంట్ సమయంలో వైసీపీకి ఆయన పరోక్షంగా కౌంటర్ వేసి వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే

## కన్నప్ప నుంచి శివ శివ శంకరా సాంగ్...




**బలగం టీవి, హైదరాబాద్**

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కన్నప్ప . ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే కన్నప్ప నుంచి లాంచ్ చేసిన టీజర్‌తోపాటు వివిధ పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

తాజాగా శివ శివ శంకరా లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. శివుడిపై కన్నప్పకున్న భక్తి భావాన్ని ప్రతిబింబించేలా శివ శివ శంకరా లిరికల్ వీడియో సాంగ్ సాగుతూ సినిమా థీమ్ ఎలా ఉండబోతుందో చెబుతోంది. ఈ పాటను శ్రీశ్రీ రవిశంకర్ లాంచ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను విజయ్ ప్రకాశ్ పాడాడు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కన్నప్ప మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.